# గొప్ప కార్యాలు

## (అపొస్తలుల కార్యములు - సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** లూకా సువార్తకు కొనసాగింపుగా ఉన్న అపొస్తలుల కార్యములు, క్రొత్త నిబంధనలోని సువార్తలకు మరియు పత్రికలకు మధ్య వారధిలాంటిది. పత్రికలలోని సంఘాల చరిత్రను అర్థం చేసికోవాలంటే అపొస్తలుల కార్యముల గ్రంథంలోని వాటి ఆవిర్భవాన్ని తెలిసికోవాలి. కనుక అపొస్తలుల కార్యముల గ్రంథం క్రొత్త నిబంధనలో కీలకమైన స్థానం వహించింది.

**1. గ్రంథకర్త :** వైద్యుడైన లూకా. ఇతడు పౌలు సహచరుడు. (అపొ 16:10-24; II తిమో 4:11; కొల 4:14. అతడు సిరియా దేశస్తుడు. కొలస్సీ 4:14లో అతని పేరు అన్య క్రైస్తవుల పేర్లతో కలిపి వ్రాయబడింది గనుక అతడు యూదుడు కాదని అర్థం చేసికోవచ్చును. అతడు విద్యావంతుడు మరియు సూక్ష్మగ్రాహి. అపొస్తలుల కార్యములు 1:1 మరియు లూకా సువార్త 1:1 ని బట్టి లూకా సువార్తను వ్రాసిన గ్రంథకర్తనే అపొస్తులుల కార్యముల గ్రంథమును వ్రాసాడని నిశ్చయంగా చెప్పవచ్చును.

**2. గ్రంథ రచన కాలము :** క్రీ. శ. 64-65 సంవత్సరంలో ఈ గ్రంథం వ్రాయబడింది. ఈ గ్రంథములో క్రీ. శ. 33 సంవత్సరముల నుండి 65 సంవత్సరముల వరకు గల 30 సంవత్సరాల సంఘ చరిత్ర వ్రాయబడింది.

**3. గ్రంథ విశిష్ఠత :**

అ. అపొస్తలుల కార్యములు సువార్తలకు కొనసాగింపు. సువార్తలన్ని మన పాపాల కోసం చనిపోయిన మనుష్య కుమారుని గూర్చి ఆయన ప్రారంభించిన పనిని గూర్చి సిలువ వేయబడి పునరుత్థానుడైన క్రీస్తును గూర్చి చూపిస్తున్నాయి. అపొస్తలుల కార్యములు పరిశుద్ధాత్మ శక్తిగా వచ్చిన దేవుని కుమారుని గూర్చి, పరిశుద్ధాత్మ ద్వారా ఆయన శిష్యులు కొనసాగించిన పనిని గూర్చి, ఆరోహణుడైన ప్రభువును, నాయకుణ్ణి చూపిస్తున్నది.

ఆ) ఈ గ్రంథంలో అపొస్తలుల కార్యాలనే కాదు గాని పరిశుద్ధాత్మ కార్యాలను చూస్తాము. ఈ గ్రంథంలో పరిశుద్ధాత్మను గూర్చి 70 సార్లు ప్రస్తావించబడింది.

ఇ) ఈ గ్రంథంలో సాక్ష్యము అనే మాట 30 సార్లు వ్రాయబడింది. ఈ గ్రంథానికి సాక్ష్యమే కేంద్రం. రక్షణ క్రీస్తు ద్వారానే కలుగుతుంది. (అపొ 4:12) అయితే మనుష్యులు ఆయనను తెలిసికొంటేనే రక్షించబడతారు. కనుక క్రీస్తును గూర్చి సాక్ష్యమివ్వాల్సిన అవసరత ఉంది. క్రీస్తు ఒక్కడే లోకానికి రక్షణ నివ్వగలడు గాని ఆయన ఒక్కడే అందరిని రక్షణ ప్రణాళిక లోనికి నడిపించలేడు. ఆ పని విశ్వాసులకు అప్పగించాడు. (అపొ 1:8).

**4. గ్రంథ బిరుదులు :** అపొస్తలుల కార్యములు లూకా సువార్తకు కొనసాగింపుగా ఉంది గనుక 5వ సువార్తగా కూడ పిలువబడుతున్నది. అంత మాత్రమేకాక, ప్రభువు లేక ఆయన ఆత్మద్వారా జరిగించబడినవాటిని బట్టి పరిశుద్ధాత్మకార్యాలు అని, పునరుత్థానుడైన ప్రభువు కార్యాలు అని కూడ పిలువబడుతున్నది.



**5. మూల వచనం :** "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను, భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను" (1:8).

**B. గ్రంథ విభజన :**

**I. ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ శక్తితో శిష్యుల ద్వారా యెరూషలేములో జరిగించినపరిచర్య (1-7 అధ్యా).**

| | |
|---|---|
| A. పరిశుద్ధాత్మ ఆగమనము కొరకు సిద్ధపాటు | 1 అధ్యా |
| 1. ఉపోద్ఘాతం (1:1-2). | |
| 2. పునరుత్థానంతరం ప్రభువు 40 రోజులు చేసిన పరిచర్య (1:3-8). | |
| 3. యేసు ఆరోహణం - పునరాగమన వాగ్దానం (1:9-11). | |
| 4. పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టుట (1:12-14). | |
| 5. అపొస్తలుని ఎన్నిక (1:15-26). | |
| B. పెంతెకొస్తు దినము | 2 అధ్యా |
| 1. పరిశుద్ధాత్మ దిగివచ్చుట (2:1-3). | |
| 2. పేతురు కాలంలోని సంఘంలో మొదటి ప్రసంగం (2:14-47). | |
| C. సంఘంలో మొదటి అద్భుతం-పేతురు రెండవ ప్రసంగం | 3 అధ్యా |
| 1. కుంటివానిని బాగుచేయుట (3:1-11). | |
| 2. పేతురు వినతి మరియు తనను బయలుపరచుకొనుట (3:12-26). | |
| D. సంఘానికి కలిగిన మొదటి హింస - పరిశుద్ధాత్మ శక్తి | 4 అధ్యా |
| E. అననీయ సప్పీరాల మరణం - రెండసారి హింస | 5 అధ్యా |
| F. పరిచారకుల నియామకం, వారిలో ఒకరైన స్తెఫెను సాక్ష్యం | 6 అధ్యా |
| G స్తెఫెను ప్రసంగం మరియు హత సాక్షిగా మరణం | 7 అధ్యా |

**II. ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ శక్తితో శిష్యుల ద్వారా యూదయ మరియు సమరయలో జరిగించినపరిచర్య (8-12 అధ్యా).**

| | |
|---|---|
| A. ఐతియోపియుడైన (హాముపంశస్థుడైన) నపుంసకుని మార్పు | 8 అధ్యా |
| B. తార్సువాడైన (షేము వంశస్థుడైన) సౌలు మార్పు | 9 అధ్యా |
| C. రోమీయుడైన (యాపెతు వంశస్థుడైన) కొర్నేలీ మార్పు | 10 అధ్యా |
| D. పేతురు తన పరిచర్యను సమర్ధించుకొనుట | 11 అధ్యా |
| E. యాకోబు మరణం - పేతురు బంధించబడుట | 12 అధ్యా |

**III. ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ శక్తితో శిష్యుల ద్వారా భూదింగంతాల వరకు జరిగించినపరిచర్య (13-28 అధ్యా)**

| | |
|---|---|
| A. పౌలు మొదటి సౌవార్తిక యాత్ర | 13,14 అధ్యా |
| B. యెరూషలేము మహాసభ | 15 అధ్యా |
| C. పౌలు రెండవ సౌవార్తిక యాత్ర | 15:36-18:22 |

D. పౌలు మూడవ సౌవార్తిక యాత్ర 18:23-21:14
E. పౌలు యెరూషలేముకు వెళ్ళుట - బంధించబడుట 21:15-40
F. యెరూషలేములోని సమూహము మధ్య పౌలు 22 అధ్యా
G సన్హెద్రిన్ సభ ఎదుట పౌలు 23 అధ్యా
H. ఫేలిక్స్ ఎదుట పౌలు 24 అధ్యా
I. ఫేస్తు ఎదుట పౌలు 25 అధ్యా
J. అగ్రిప్ప ఎదుట పౌలు 25 అధ్యా
K. పౌలు రోమాకు ప్రయాణం - తుఫానులో ఓడ బ్రద్దలగుట 27 అధ్యా
L. పౌలు రోమాకు చేరుట - అన్యుల మధ్య చివరి ప్రసంగం 28 అధ్యా

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

### I. యేసుప్రభువు పరిశుద్ధాత్మ శక్తితో శిష్యుల ద్వారా యెరూషలేములో జరిగించిన పరిచర్య

**1. సాక్ష్యము కొరకైన శక్తి (1, 2 అధ్యా) :** యేసు పునరుత్థానంతరం 40 రోజులు శిష్యులకు కనబడి, దేవుని రాజ్యమును గూర్చిన విషయాలను బోధించాడు. తరువాత తండ్రి వలన వాగ్దానం చేయబడిన పరిశుద్ధాత్మను పొందేంత వరకు యెరూషలేములో నిలిచి ఉండమని ఆజ్ఞాపించాడు (1:4,5). మొదటి అధ్యాయంలోని 11 వచనాలు ఈ గ్రంథంలోని మిగతా అంశాలన్నిటికి ఉపోద్ఘాతంగా ఉన్నాయి. అందులో గొప్ప ఆజ్ఞ 1:6-8, యేసు ఆరోహణం 1:2, 9, 11, ఆయన రాకడను గూర్చిన వాగ్దానం (1:10,11) ఉన్నాయి.

యేసుక్రీస్తు పరలోకానికి ఏ విధంగా వెళ్ళాడో ఆలాగే తిరిగి వస్తాడు.

ఆయన ఒక్కడే వెళ్ళాడు, ఆలాగే తిరిగి వస్తాడు. (I థెస్స 4:16). ఆయన ఆరోహణం దృశ్యమైనది. ఆయన తిరిగి వచ్చినప్పుడు కూడ అందరికి కనిపిస్తాడు. (ప్రక 1:7). ఆయన శరీరంతో వెళ్ళాడు. శరీరంతోనే తిరిగి వస్తాడు. (మత్త 24:30). ఆయన ఒలీవల కొండ మీది నుండి వెళ్ళాడు. అక్కడికే తిరిగి వస్తాడు. (లూకా 24:50 జెక 14:4).

**2. సంఘం యొక్క ఉద్దేశం :** పైన వివరించబడిన వచనాలలో అనగా 1:1-11 లో సంఘం యొక్క ఉద్దేశం గోచరమౌతుంది. యేసు ద్వారా ఇవ్వబడిన చివరి ఆజ్ఞలోని వెళ్ళుట, శిష్యులనుగా చేయుట, బాప్తిస్మమిచ్చుట, ఆయా సంగతులను గైకొనునట్లు ఆజ్ఞాపించుట అన్న ఉద్దేశాలన్నిటికి అపొస్తలుల కార్యాల గ్రంథం నిదర్శనంగా ఉంది. ఈ నాలుగు అంశాలు ఒక దానితో ఒకటి పొందిక కలిగి, ఒక దానికి మరొకటి కొనసాగింపుగా ఉన్నాయి. యేసు ఇచ్చిన గొప్ప ఆజ్ఞ సంఘానికి జన్మనిచ్చింది. ఆ గొప్ప ఆజ్ఞ నెరవేర్పు వలన పెంతెకొస్తు ప్రాముఖ్యతను సంతరించుకొంది.

**3. సంఘానికివ్వబడిన గొప్ప వాగ్దానం :** దేవునిచే ఇవ్వబడిన వాగ్దానం నెరవేర్చబడ్డాకనే దేవుని ఆజ్ఞ నెరవేర్చబడుతుందని ప్రభువు స్పష్టంగా చెప్పాడు. ఈ గ్రంథంలో యేసు క్రీస్తుతో పాటు, పరిశుద్ధాత్మ దేవుడు ప్రాముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉన్నాడు. ఆయనను గూర్చిన వాగ్దానాన్ని యోహాను సువార్తలో 4 సార్లు చూస్తాము. (యోహా 1:33; 7:3-39; 14:16, 17; 20:22). అదే వాగ్దానం అపొ 1:8 లో ఇవ్వబడింది.



పాత నిబంధనలో పరిశుద్ధాత్మ కార్యాలు తెలియజేయబడ్డాయి కాని ఇప్పుడు క్రొత్త నిబంధనలో ఆయన సంపూర్ణ పరిచర్య మూడు విధాలుగా వివరించబడింది.

**a) పరిశుద్ధాత్మ పరిచర్య సార్వత్రికమైనది :** పాత నిబంధనలో ఆయన పరిచర్య ఇశ్రాయేలు జాతికి మాత్రమే పరిమితమైనది. కాని ఇప్పుడు మారుమనస్సు పొందిన ప్రతి పాపిలో నివసించి తన కార్యం చేస్తాడు.

**b) పరిశుద్ధాత్మ పరిచర్య శాశ్వతమైనది :** పాత నిబంధనలో ఆయన అవసరతను బట్టి తాత్కాలికంగా మనుష్యులతో ఉండి తన కార్యాన్ని జరిగించాడు (న్యాయా 14:6, 19; 15:14; 16:20; I సమూ 10:10; 16:14; కీర్త 51:11) ఇప్పుడైతే ఆయన మనలో, లోకంలో క్రీస్తు రాకడ పర్యంతం ఉంటాడు.

**c) పరిశుద్ధాత్మ పరిచర్య పరిపూర్ణమైనది :** రక్షించబడిన ప్రతి పాపి క్రీస్తు కృపలో పరిపూర్ణంగా ఎదగడానికి పరిశుద్ధాత్మ వారిలో పనిచేస్తూనే ఉంటాడు.

**4. సంఘం ఉద్భవించుట :** పక్షిరాజు బలమైన గాలులు వీచేంతవరకు కనిపెట్టి, గాలి వేగం పెరిగినప్పుడు తన గూటి నుండి దూకి, రెక్కలు చాపి, గాలి వాటానికి అంతకంతకు ఎత్తుకు ఎగిరిపోతుంది. ఆలాగే ఆదిమ సంఘం, పరిశుద్ధాత్మ బలంగా దిగివచ్చేంతవరకు కనిపెట్టింది. స్పష్టమైన రుజువులతో అనగా బలమైన గాలి వంటి ధ్వనితో, అగ్ని జ్వాలల వంటి నాలుకలతో పరిశుద్ధాత్మ సంఘముపైకి వచ్చినప్పుడు సంఘం శక్తినొందింది. ఒక నూతన వ్యవస్థగా ప్రాధాన్యతను సంతరించుకొంది. దృశ్యంగా మరియు అదృశ్యంగా ఉన్న సంఘం పరిశుద్ధాత్మ రాకతో తన ఉనికిని యెరూషలేములో ప్రారంభించి, భూదిగంతాల వరకు వ్యాపిస్తూ ఉంది.

**5. యెరూషలేములో సాక్ష్యము :** పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ క్రుమ్మరింపు అన్నది ఒక వింతైన అద్భుతం.

2:14-36 వరకు పేతురు చేసిన ప్రసంగంలో ప్రభువు మరణ పునరుత్థానాలను నొక్కి వక్కాణించాడు. ఈ రెండు క్రైస్తవ విశ్వాస రథానికి రెండు చక్రాల్లాంటివి. ఆయన మరణించకుండ ఉంటే పాపక్షమాపణ లేదు. ఆయన పునరుత్థానం లేకుంటే మనకు నిత్య జీవం లేదు. ఆయన పునరుత్థానం రక్షణకు సంపూర్ణతను చేకూర్చింది. పేతురు ఈ గ్రంథంలో 4 ముఖ్యమైన ప్రసంగాలు చేసాడు. అతని బోధ అభిషిక్తమైనది, క్రీస్తు కేంద్రితమైనది, వాక్యానుసారమైనది, సహేతుకమైనది మరియు సౌవార్తికమైనది. ఈ బోధతో యెరూషలేమును నింపివేసారన్న అభియోగం వీరిపై మోపబడింది.

పేతురు తన ప్రసంగంలో పలు పాత నిబంధన ప్రవచనాలను ఎత్తి చూపించి క్రీస్తే మెస్సీయా అని నిరూపించాడు. ఫలితంగా 3000 మంది రక్షించబడ్డారు. అపొస్తలుల బోధ, సహవాసం, రొట్టెవిరుచుట, ప్రార్థన మొదలైన ప్రభువుకు మహిమకరమైన విషయాలలోనే ఆది సంఘము నిమగ్నమైయుండినది. అద్భుతాలు, సూచక క్రియలు జరుగుతూ ఉన్నాయి. కాని వెంటనే శ్రమలు కలుగనారంభించాయి. 3వ అధ్యాయంలో, శృంగారమను దేవాలయంలో కుంటివాణ్ణి స్వస్థపరచడం, ప్రజల గుమికూడడం మళ్ళీ పేతురు ప్రసంగం చేయడం, తద్వారా ఆ రోజు 5000 మంది సంఘంలో చేర్చబడ్డం ఇవన్నీ పరిశుద్ధాత్మ శక్తికి నిదర్శనాలు.

యూదా మతాధికారులు పేతురు, యోహానుల ధైర్యాన్ని చూసి, వారు విద్యలేని పామరులు కదా! వారికి ఇంత జ్ఞానం ఎక్కడి నుండి వచ్చిందని ఆశ్చర్యపడ్డారు (4:13). క్రీస్తు కొరకు సాక్ష్యమివ్వాలన్న దృఢ నిశ్చయతగలవారికి ఎలాంటి విద్యార్హతలు అక్కర్లేదు. చదువొక్కటే నిన్ను ప్రసంగికుణ్ణి చెయ్యదు. నీవు నేర్చుకొన్ని దానిపై, నీ బోధనా సామర్థ్యంపై దేవుని అభిషేకం కోరుకోవాలి. వ్యక్తిగతంగా పెంతెకొస్తు అనుభవంగల వారికి ఎక్కువ చదువు లేకున్నా దేవుడు వాడుకొంటాడు అట్టి అనుభవంగల గొప్ప విద్యావంతులను కూడ దేవుడు వాడుకొంటాడు. విద్యలేని పేతురును విద్యావంతుడైన పౌలును దేవుడు గొప్పగా వాడుకొన్నాడు.

సంఘ విస్తరణతో బాటు సంఘానికి కష్టాలు, శ్రమలు ప్రారంభమయ్యాయి. తాము సిలువవేసిన యేసు తిరిగిలేచాడన్న బోధ యాజకులకు, పరిసయ్యులకు, శాస్త్రులు మరియు మతాధికారులకు కోపం తెప్పించింది. ఎక్కడ ఆత్మ దీవించేందుకు వస్తాడో అక్కడ సాతాను శపించేందుకు వస్తాడు. వారు ఈ బోధను చెప్పవద్దని ఖండించారు. కాని 4:12లో పేతురు చరిత్రాత్మకమైన సమాధానం ఇచ్చాడు, “మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణ పొందలేము.” శాస్త్రులు, పరిసయ్యులు యేసు నామమున ఇక ఏమాత్రం బోధించవద్దని హెచ్చరించారు. అందుకు పేతురు, యోహానులు తాము వారి మాట కంటె దేవుని మాటనే వింటామని, తాము కన్నవాటిని విన్న వాటిని చెప్పకుండ ఉండలేమని ప్రత్యుత్తరమిచ్చారు (4:19, 20) ప్రభువు నందు విశ్వాసముంచినవారు సాక్ష్యమివ్వకుండ ఉండలేరు. తద్వారా శ్రమలు వస్తాయి. అయితే ఆదిమ సంఘంలో శ్రమలు రెట్టింపు ఫలితాన్ని తీసికొని వచ్చాయి.

**6. సంఘ ఐక్యత :** ఆదిమ సంఘంలోనికి విశ్వాసులు తమకు ఎదురౌతున్న శ్రమల నెదుర్కోడానికి దేవుని శక్తిని కోరారు (4:31) ఈ విధమైన బోధ మరియు ప్రార్ధన వారిలో ఐక్యతను కలిగించింది. వారిలోని స్వార్థం పోయింది. ప్రేమ మరియు దాతృత్వం వృద్ధిచెందాయి. ప్రతివారి అక్కరలు తీర్చబడ్డాయి 4:312 నుండి 5వ అధ్యాయం చివరి వరకు ఈ ఐక్యతను గూర్చే వివరించబడింది. విశ్వాసులు అలా ప్రేమ ఐక్యతలను కలిగి ఉండాలనే ప్రభువు ప్రార్థించాడు (యోహా 17:20,21). ఆదిమ సంఘం వేగంగా విస్తరించడానికి, పరిశుద్ధాత్మ నింపుదల మరియు విశ్వాసుల ఐక్యతనే ప్రధాన కారణాలు. ఈనాడు మన సంఘాలు ఎలా ఉన్నాయి ?

**7. సంఘ పరిచర్య విభజన :** ఒక్కరే అన్ని బాధ్యతలను నిర్వర్తించాలంటే చాల కష్టం. పైగా దానిని బట్టి మరికొన్ని క్రొత్త సమస్యలెదు రౌతాయి. ఆదిమ సంఘంలో అక్షరాల ఆలాగే జరిగింది. 6వ అధ్యాయం ప్రారంభంలో హెబ్రీయులకు మరియు గ్రీకు భాష మాట్లాడే యూదుల మధ్య ఏర్పడిన సమస్యను అపొస్తలులు పరిష్కరించిన తీరు మెచ్చుకోదగినది (6:3:4). అపొస్తలులకు వారి పిలుపు ఏంటో బాగా తెలుసు. కనుక పరిచర్య నిమిత్తం పరిచారకులను నియమించారు. వారు మట్టుకు సువార్త సేవ కోసం తమ్మును తాము ప్రత్యేకించుకొన్నారు. ప్రభువు మనల్ని ఏపని కొరకు పిలిచాడో ఆ పనే చెయ్యాలి. గొప్ప దర్శనంతో సువార్త సేవను ప్రారంభించి, ఈలాంటి పనులలో జోక్యం చేసికొని తమ దర్శనాన్ని కోల్పోయిన వారు ఎంతమంది లేరు ?

**8. సంఘ ప్రథమ హతసాక్షి :** ఏడుగురు పరిచారకులలో ఒకడైన స్తెఫెను, పరిచర్యతో పాటు,



సువార్త సేవలో కూడ చురుకుగా పాల్గొనడం గమనార్హం. మాట్లాడుటలో అతడు అగపరచిన జ్ఞానాన్ని ఎవరూ ఎదిరింపలేకపోయారు (6:10) పైగా అతనిపై కోపంతో అబద్ధ సాక్షులను కూర్చుకొని, ప్రజలను, పెద్దలను శాస్త్రులను రేపి, అతణ్ణి పట్టుకొని, మహాసభయెదుటికి తీసికొని వెళ్ళారు. యేసు ప్రభువు లూకా 21:12-15 లో చెప్పిన మాటలకు నెరవేర్పుగా ఇది జరిగింది.

స్తెఫెనుపై నాలుగు నేరాలు మోపబడ్డాయి. మొదటిది దేవుని గూర్చినది (6:11). అతడు తన ప్రసంగంలో దేవుని గూర్చి 16 సార్లు ప్రస్తావించి, ఘనపరచుట ద్వారా తాను దేవ దూషకుడు కాడని నిరూపించుకున్నాడు. రెండవ నేరం మోషేను గూర్చినది (6:11) అది వాస్తవం కాదని మోషే ద్వితీయోపదేశకాండము 18:16లో చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేస్తూ అతడు ఎవరిని గూర్చి చెప్పాడో ఆ ప్రవక్త క్రీస్తేనని, వారే ఆయనను తృణీకరిస్తున్నారని హెచ్చరించాడు. (7:37) మూడవ నేరం దేవాలయానికి సంబంధించినది. అది స్థిరమైనది కాదని, దేవుణ్ణి ఆరాధించడానికి దేవాలయం అవసరంలేదని యెషయా చెప్పి మాటల్ని అతడు జ్ఞాపకం చేసాడు. (7:44-50). యూదులకు ఇక మీదట మందిరం యొక్క అవసరత ఉండదని చెప్పాడు. ఈ విషయాన్ని ప్రభువు ముందే చెప్పాడు. (యోహా 4:20-24).

అంత మాత్రమే కాదు అతడు ఆత్మతో నింపబడి, యేసు దేవుని కుడి పార్శ్వమున నిలువబడినట్లు చూసి వారితో చెప్పగానే వారు కేకలు వేస్తూ అతణ్ణి రాళ్ళతో కొట్టిచంపారు. చట్టప్రకారం ఒకరోజు ముందు తీర్పు జరిగాక, రోమా అధికారుల చేతనే మరణ శిక్ష విధించబడాలి. యేసు ఆరోహణానంతరం స్తెఫెను, పౌలు, యోహాను మాత్రమే ఆయనను చూసారు.

సిలువలో యేసు ప్రార్థించినట్లే, స్తెఫెను ప్రార్థించాడు. (7:59, 60) సంఘ స్థాపన తరువాత క్రీస్తు కొరకు మొట్టమొదట ప్రాణం పెట్టిన హతసాక్షి స్తెఫెను. అతని మరణం నిద్రతో పోల్చబడింది. విశ్వాసి మరణం అతని జీవితానికి అంతం కాదు. అది నిద్ర మాత్రమే. (మత్త 27:52; యోహా 11:11; అపొ 13:36; I కొరి 15:18; 20, 51 I థెస్స 4:13-15; II పేతు 3:4).

## II. యేసు ప్రభువు పరిశుద్ధాత్మ శక్తితో శిష్యుల ద్వారా యూదయ మరియు సమరయలో జరిగించిన పరిచర్య (8-12 అధ్యా)

**1. సంఘము బయటికి వెళ్ళుట :** యోరూషలేములోని సంఘానికి గొప్ప హింస కలిగినందున అపొస్తలులు తప్ప అందరు యూదయ, సమరయ దేశాలలో చెదరిపోయారు అని వ్రాయబడింది (8:1) వారు చెదరిపోయారు అనడం కన్న, అపొ 1:8లోని ఆజ్ఞ నెరవేర్పు నిమిత్తం దేవునిచేత బలవంతంగా చెదరగొట్టబడ్డారని చెప్పవచ్చు. దేవుడు మనకు చెప్పిన దానిని మనం స్వచ్ఛందంగా చేయనప్పుడు, అలా చేసేలాగ, మన పరిస్థితులను మార్చివేస్తాడు. అది మనకు కష్టంగా అనిపించినా మన మేలు కొరకు, మన జీవితంలో ఆయన సంకల్ప సిద్ధి కొరకు అలా అనుమతించబడుతుంది.

**2. ఫిలిప్పు పరిచర్య :** 8వ అధ్యాయం నుండి ప్రభువు రాజ్య సువార్త యూదయ, సమరయ దేశాలలో ఎలా వ్యాపించిందో వివరించబడింది. ఇక్కడ మనం నేర్చుకోవాల్సిన విషయం ఏమంటే, సువార్త ప్రకటన, లేక సాక్ష్యమివ్వడం అన్నది ప్రతి విశ్వాసి పని. సమరయ ప్రాంతంలో సువార్త

ప్రకటించినవారిలో ఫిలిప్పు కూడ ఉన్నాడు. అతడు పరిచారకుడు మాత్రమే కాదు, మంచి సువార్తికుడు కూడ.

ఫిలప్పు పరిచర్య ద్వారా సమరయలో అనేకులు రక్షించబడ్డారు. అనేక అద్భుతాలు చేయబడ్డాయి (8:4:8). తరువాత అతడు ఆత్మచేత కొనిపోబడి, గాజాకు వెళ్ళే అరణ్యమార్గంలో ఐతియోపియుడైన నపుంసకునికి సువార్త చెప్పాడు. (8:26-39). అతడు వెంటనే రక్షించబడి బాప్తిస్మం పొందాడు. ఈ సంఘటన మనకు ఓ ఆత్మీయ సత్యాన్ని బోధిస్తుంది. ఆ నపుంసకుడు యెషయా 53వ అధ్యాయాన్ని చదువుతున్నాడు, కాని అది అతనికి అర్థం కాలేదు. ఫిలిప్పు అందలి వ్యక్తిని గూర్చి, అనగా రక్షకుడైన యేసును అతనికి పరిచయం చేసాడు. ఈనాడు మన చుట్టు ఈలాంటి అన్వేషకులు ఎందరో కనిపిస్తూ ఉంటారు. వారు గ్రహింపలేని, అర్థంకాని విషయాలను వారికి బోధించి సత్యమార్గంలోనికి నడిపించాలి. ఆనాడు ఫిలిప్పు ద్వారా రక్షించబడిన ఐతియోపియుని బట్టి ఆఫ్రికా ఖండానికి క్రీస్తు సువార్త వెళ్ళిందని చెప్పవచ్చు. తరువాత ఫిలిప్ప కైసరయలో స్థిరపడ్డాడు. (8:40; 21:8,9).

**3. పేతురు యోహానుల పరిచర్య :** సమరయలో గారడీవాడును, దేవుని మహాశక్తి అనబడిన సీమోను నందు లక్ష్యముంచిన వారు ఫిలిప్పు సువార్త ప్రకటన ద్వారా బాప్తిస్మం పొందారు. అప్పుడు సీమోను కూడ నమ్మాడు (8:9-13). యెరూషలేములోని అపొస్తలులు వీరిని బలపర్చేందుకు పేతురును, యోహానును వారియొద్దకు పంపించారు. వారు బాప్తిస్మం పొందినవారి మీద చేతులుంచి ప్రార్థన చేసినపుడు వారు పరిశుద్ధాత్మను పొందడం చూసిన సీమోను వారికి ద్రవ్యమిచ్చి తాను ఎవరిమీద చేతులుంచుతాడో వారు పరిశుద్ధాత్మను పొందేలా తనకు అధికారమిమ్మని అడిగాడు. పేతురు, అతని హృదయం దేవుని యెదుట సరియైనది కాదు గనుక ఈ కార్యంలో తనకు పాలుపంపులు లేవని చెప్పి తన చెడుతనాన్ని విడిచి మారుమనస్సుపొందమని హెచ్చరించాడు (8:14-24).

**4. సౌలు మారుమనస్సు పొందుట :** అపొస్తలుల కార్యములు 9వ అధ్యాయం ప్రత్యేకమైనది. స్తెఫెను మరణ సమయంలో ప్రప్రథమంగా సౌలును గూర్చి ప్రస్తావించబడింది. అతడు స్తెఫెను మరణానికి సాక్షి. (7:57, 58; 22:20) క్రైస్తవులను హింసించాడు. (8:3; 22:5; 19; 26:10, 1; గలతీ 1:13) వారిని చంపడమే దేవుని సేవ అనుకొన్నాడు. ఆలాంటి సౌలు మార్చబడడం ఆశ్చర్యకరమైన విషయం.

దమస్కు మార్గంలో సౌలు జీవిత మార్గం మలుపు తిరిగింది. అతని వద్దకు అననీయ పంపిచంబడినప్పుడు అతని విషయం దేవుని సంకల్పాన్ని స్పష్టం చేసాడు. (9:15,16). అననీయ అతని కొరకు ప్రార్థించగానే అతడు కోల్పోయిన దృష్టిని తిరిగి పొందాడు. దమస్కులోని శిష్యులతో కొన్ని దినాలు గడిపాక వెంటనే సమాజమందిరాలలో యేసే దేవుని కుమారుడని ప్రకటించడం ఆరంభించాడు. (9:18,19) యూదులు అతన్ని చంపాలని ప్రయత్నించినప్పుడు, బర్నబా అతన్ని దగ్గర తీసి యెరూషలేములోని అపొస్తలుల వద్దకు తీసికొని వెళ్ళాడు. అతనికున్న మరణాపాయాన్ని బట్టి అతన్ని యెరూషలేము నుండి సరకు తోడుకొని వెళ్ళి అతని స్వస్థలమైన తార్సుకు పంపించాడు.

**5. పేతురు ద్వారా జరిగించబడిన అద్భుతాలు :**పేతురు లుద్దలోని విశ్వాసులను దర్శించినప్పుడు



8 ఏండ్ల నుండి పక్షవాతముతో మంచము పట్టిన ఐనెయను. స్వస్థపరచుట ద్వారా లుద్ద మరియు షారోనులో ఉన్నవారందరు విశ్వసించారు (9:32-35), అలాగే యొప్పేలో చనిపోయిన తబితా అనే శిష్యురాలిని తిరిగి లేపడం ద్వారా అనేకులు ప్రభువును విశ్వసించారు. పేతురు చర్మకారుడైన సీమోను ఇంటిలో చాలకాలం ఉన్నాడు (9:36-43).

**6. అన్యజనులకు సువార్త :** పేతురు సీమోను ఇంటిలో ఉన్నప్పుడే, ఇటలీ పటాలంలోని శతాధిపతియైన కొర్నేలీ అనే భక్తిపరునితో దేవుని దూత మాట్లాడడం, అతడు పేతురు యొద్దకు మనుష్యులను పంపించడం, పేతురు కైసరయలోని కొర్నేలీ ఇంటికి వెళ్ళడం, అక్కడ అతడు చేసిన ప్రసంగం ద్వారా అతని బోధవిన్నవారందరి మీదికి పరిశుద్ధాత్మ దిగిరావడం, వారు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మం పొందడం అన్నీ ఆశ్చర్యంగా జరిగిపోయాయి. దేవుడు పక్షపాతి కాడని, ఆయన అందరికి ప్రభువని, తనయందు విశ్వాసముంచిన, ఏ జాతివారినైనా రక్షిస్తాడని పేతురు గ్రహించాడు (10:34-36).

అన్యులకు రక్షణ సువార్తనందించే విషయంలో యూదులలో కొంత వివాదం చెలరేగింది (11:1-3), కాని పేతురు జరిగిన విషయాన్నంతా కూలంకశంగా వివరించాక వారు ఏమి అడ్డు చెప్పకుండ, అన్యజనులకు దేవుడు జీవార్థమైన మారు మనస్సు దయచేసాడని దేవుణ్ణి స్తుతించి మహిమ పర్చారు. (11:18).

స్తెఫెను శ్రమను బట్టి చెదరిపోయినవారిలో కుప్రీయులు, కురేనీయులు అంతియొకయకు వచ్చి గ్రీసు దేశపు వారికి సువార్తను ప్రకటించారు. నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగారని విని యెరూషలేములోని సంఘస్తులు బర్నబాను పంపించారు. అతడు వచ్చి ప్రభువును స్థిర హృదయంతో హత్తుకోవాలని వారిని హెచ్చరించాడు. తరువాత అతడు తార్సుకు వెళ్ళి సౌలును అంతియొకయకు తీసికొని వచ్చాడు. వారిద్దరు, ఆ సంఘములో ఒక సంవత్సరం పాటు దేవుని వాక్యాన్ని బోధించారు. మొట్టమొదట అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడ్డారు (11:8-26).

**7. యాకోబు చంపబడుట :** ఓ వైపు సువార్త ప్రకటించబడతూ ఉండగా మరోవైపు క్రైస్తవులకు హింసలు అధికమౌతూ వచ్చాయి. రాజైన హేరోదు సంఘంలోని వారిని బాధపెడుతూ, వారిని బలత్కారముగా పట్టుకొని, యోహాను సహోదరుడైన యాకోబును ఖడ్గంతో చంపించాడు. అది యూదులకు ఇష్టమైన కార్యమని తెలిసికొని పేతురును కూడ పట్టుకొని చెరసాలలో వేయించాడు (12:1-4). సంఘము అతని కొరకు అత్యాసక్తితో ప్రార్థించింది. మరునాడు అతడు చంపబడతాడు అనుకొన్న సమయంలో దేవుని దూత అతన్ని చెరసాల నుండి బయటికి, తీసికొని రావడం, సంఘంలో విభ్రాంతికి, సైనికులలో గలిబిలికి కారణమైంది (12:5-13).

## III. యేసు ప్రభువు పరిశుద్ధాత్మచే తన శిష్యుల ద్వారా భూదిగంతాల వరకు పరిచర్య జరిగించుట. (13-28 అధ్యా)

మొదటి శతాబ్దంలోని క్రైస్తవ్యాన్ని ఒక భక్తుడు "రెండు పట్టణాల గాథ"గా పేర్కొన్నాడు. 12వ అధ్యాయం వరకు యెరూషలేములో సంఘ ఆరంభం, పేతురు నాయకత్వాన్ని చూస్తాము. 13వ అధ్యాయం నుండి అంతియొకలోని సంఘం మరియు పౌలు నాయకత్వాన్ని చూస్తాము.

యేసు చివరి ఆజ్ఞను కొనసాగించేందుకు అంతియొకయ ఒక నూతన కేంద్రమైంది. ఒకవేళ బర్నబా పౌలును కనుగొని ఉండకపోతే లోకంలో ఏ కొరత ఉండేదో ఒకసారి ఆలోచించండి. అలా దేవుని కొరకు కనుగొనబడవలసిన వారెందరున్నారో, అందుకు మన బాధ్యత ఏంటో ఎప్పుడైనా ఆలోచించారా?

ఆదిమ సంఘంలో మొదటి మిషనరీలైన పౌలు బర్నబాలు తమ సేవను అంతియొకయకు దక్షిణ భాగము నుండి ప్రారంభించారు (13:2,3). ఈ భూదిగంతాల పౌవార్తిక ఉద్యమం ఒక ప్రార్థన కూడిక నుండి ఉద్భవించింది. పరిశుద్ధాత్మ, పౌలు బర్నబాలను పిలిచిన పనికొరకు ప్రత్యేకించమని సంఘముతో చెప్పాడు. అలా పౌలు సౌవార్తిక యాత్ర ఆరంభమైంది.

**1. మొదటి సౌవార్తిక యాత్ర (13, 14 అధ్యా) :** కుప్ర నుండి ఆరంభించిన ఈ యాత్ర సలమి, పాపు, పెర్గే, పిసిదియలోని అంతియొకయ, ఈకొనియ, లుస్త్ర, దెర్బే పట్టణాల వరకు కొనసాగించబడింది. పిసిదియలోని అంతియొకయలో పౌలు చేసిన ప్రసంగం ఇంచు మించు స్తెఫెను ప్రసంగంలా చరిత్రాత్మకమైనది. ఇశ్రాయేలు చరిత్రలో దేవుని ఐక్యాన్ని, ఆయన రక్షణ ప్రణాళికను వివరిస్తూ యేసే క్రీస్తు అని నిరూపించాడు (13:15-46) అనేకమంది యూదులు, భక్తిపరులైన యూద మత ప్రవిష్టులు పౌలు బర్నబాలను వెంబడించారు.

ఈ సౌవార్తిక యాత్ర ఫలితంగా సువార్తకు గొప్ప ప్రతిస్పందన లభించింది, పౌలుకు గొప్ప హింసలు కలిగాయి, చిన్న ఆసియాలో సంఘాలు స్థాపించబడ్డాయి. సంఘ పెద్దలు నియమించబడ్డారు.

చాలామంది సువార్తను అంగీకరించినట్లే చాలమంది దానిని తృణీకరించారు. అలా సువార్తను త్రోసివేయడం ద్వారా యూదులు తమ్మును తాము నిత్యజీవానికి అపాత్రులుగా ఎంచుకొన్నారు. సువార్త అన్యజనుల వద్దకు తీసికొనివెళ్ళేందుకు కారకులయ్యారు (13:44-52).

14:19-20 లోని సంఘటన పౌలు జీవితంలో ప్రత్యేకతను సంతరించుకొన్నది. పౌలును చంపాలని, అంతియొకయ, ఈకొనియ నుండి అతణ్ణి వెంబడిస్తున్న యూదులు లుస్త్రలోని ప్రజలను తమ పక్షంగా చేసికొని అతనిపై రాళ్ళు రువ్వి, చనిపోయాడనుకొని పట్టణం వెలుపలికి ఈడ్చుకొని వెళ్ళారు. పౌలు నిజంగా చనిపోయాడని, పునరుత్థానుడై I కొరింథీ 12:1-9 లోని అనుభవాన్ని పొందాడని చెప్తారు. కొరింథీయులకు వ్రాయబడిన పత్రిక క్రీ. శ. 55 సం॥లో వ్రాయబడింది. పౌలు తాను 14 సంవత్సరాల క్రితం ఈ అనుభవాన్ని పొందానని వ్రాసాడు. అయితే అతడు రాళ్ళతో కొట్టబడిన సంఘటన క్రీ. శ. 47 లేక 48 సం॥లో జరిగింది. కనుక ఈ అనుభవం అప్పుడు జరిగింది కాదని చెప్పవచ్చును. లుస్త్రలో అతడు మరణించాడో లేక స్పృహకోల్పోయాడో తెలియదు గాని అద్భుతంగా, వెంటనే లేచి పట్టణంలోనికి వెళ్ళాడు (14:20).

వారు దెర్బేలో సువార్త ప్రకటించి అనేకులను శిష్యులుగా చేసిన తరువాత లుస్త్రకును, అంతియొకయకును తిరిగి వచ్చి శిష్యులను దృఢపరచి, హెచ్చరించి, ప్రతి సంఘములో పెద్దలను ఏర్పరచి, వారిని ప్రభువుకు అప్పగించారు.

వారు మొదట బయలుదేరిన అంతియొకయకు తిరిగి వచ్చి, దేవుడు చేసిన కార్యాలను, అన్యజనులలో ఆయన ద్వారము తెరచిన విషయం సంఘానికి వివరించారు. (14:21-28).



**2. యెరూషలేము మహాసభ (15:1-35) :** ఆదిమ సంఘంలో సున్నతిని గూర్చి తల ఎత్తిన సమస్య విషయం యూదులకు, పౌలు బర్నబాలకు మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. (15:1-3). యెరూషలేములోని అపొస్తలులతో దీని విషయం చర్చించాలని ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. మొదట అందరు కలిసి విషయాన్ని తెలిసికొన్నారు. (15:4,5) తరువాత అపొస్తలులు, పెద్దలు కూడుకొని తర్కించారు (15:6), చివరగా మరోసారి అందరు కలిసి ఒక తీర్మానానికి వచ్చారు (15:7-29) 15:7-11లో పేతురు నివేదిక 15:12లో పౌలు బర్నబాల నివేదిక 15:13-21 లో యాకోబు నివేదికను గమనించండి. యాకోబు అన్యజనుల పట్ల దేవుని సంకల్పాన్ని జ్ఞాపకం చేస్తూ సుమెయోను మరియు ఆమోసు ప్రవక్త చెప్పిన మాటలను (ఆమో 9:11) పునరుత్ఘాటించాడు. తుదకు, అన్యజనులకు అవసరమైన ఆధ్యాత్మిక నియమాలను ఇవ్వడం తప్ప మరే భారం వారిపై పెట్టకూడదని తీర్మానం చేసికొని, పత్రికల ద్వారా వారికి తెలియజేసారు. (15:22-35).

**3. పౌలు రెండవ సౌవార్తిక యాత్ర (15:36-18:22) :** పౌలు బర్నబాలు మొదటి ప్రయాణంలో ఏయే స్థలాలలో సువార్త ప్రకటించారో ఆ స్థలాలన్నిటికి వెళ్ళి విశ్వాసులను పరామిర్శంచాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన రెండవ యాత్రలో ఆరంభంలోనే కొంత అంతరాయం ఏర్పడింది. మొదటి యాత్ర మధ్యలోనే తమను విడిచి వెళ్ళిన మార్కు విషయం పౌలు బర్నబాల మధ్య వివాదం ఏర్పడింది (15:36-39). పౌలు సీలను ఏర్పరచుకొని సిరియాకు వెళ్ళాడు; బర్నబా మార్కును తీసికొని కుప్రకు వెళ్ళాడు. తరువాత బర్నబాను గూర్చి ఈ గ్రంథంలో మరేమి వ్రాయబడలేదు. అయితే సంతోషకరమైన విషయం ఏమంటే తరువాత పౌలు. బర్నబాతో (I కొరి 9:6) మార్కుతో (కొల 4:10; ఫిలి 1:24; II తిమో 4:11) సమాధానపడ్డాడు.

త్రోయ అనే స్థలంలో పౌలుకు కలిగిన ప్రత్యేక దర్శనం (16:9) రెండవ సౌవార్తిక యాత్రలో ఓ క్రొత్త మలుపును తెచ్చింది. సువార్త ఇంకా దూర ప్రాంతాలకు సాగి వెళ్ళింది. ఈ భాగంలోని మేము అన్న మాటను బట్టి వైద్యుడైన లూకా పౌలు బృందంలో ఉన్నాడని గ్రహించాలి (16:9; 20:5,6:21:18; 27:1) మాసిదోనియాకు ముఖ్యపట్టణం ఫిలిప్పీ. ఈ పట్టణంలో మొదట లూదియ అనేస్త్రీ, తరువాత ఆమె కుటుంబం రక్షించబడింది. ఇక్కడ స్థాపించబడిన సంఘం వేగంగా విస్తరించి, మొదటి శతాబ్దంలో సువార్త ప్రకటనలో ప్రముఖ పాత్ర వహించింది. అదే పట్టణంలో పుతోను దయ్యము పట్టిన బాలిక విడిపించబడడం (16:16-18) జైలు అధికారి రక్షించబడడం చూస్తాము. 16:30లో అతని ప్రాముఖ్యమైన ప్రశ్నకు పౌలు ఇచ్చిన జవాబులో సువార్త సారాంశమంతా ఉంది.

ఫిలిప్పీ నుండి పౌలు థెస్సలొనీకయకు వెళ్ళాడు. ఈ పట్టణం ఫిలిప్పీ పట్టణానికి 100 మైళ్ళ దూరంలో ఉంది. అలెగ్జాండర్ చక్రవర్తి సోదరియైన థెస్సలొనీకకు గుర్తుగా దానికి ఆ పేరు పెట్టబడింది. పౌలు దాన్ని దర్శించిన కాలం నాటికి, దాని జనాభా సుమారు 2 లక్షలకు పైగా ఉందని అంచనా. ఈ పట్టణంలో పౌలు సువార్త సమాజమందిరంలో జరిగింది. ప్రభువు మరణ పునరుత్థానాలే పౌలు ప్రసంగ ప్రాముఖ్య అంశాలు. దాన్ని కొంతమంది నమ్మారు, కొంత మంది అపహసించారు. ఆ పట్టణస్థులు వారికిచ్చిన బిరుదు "భూలోకమును తలక్రిందులు

చేసినవారు." ఈ పట్టణంలో సంఘం స్థాపించబడ్డాక పౌలు సంఘ నిర్వహణతో పాటు తన అవసరాల నిమిత్తం డేరాలు కుట్టుకొనేవాడు. (I థెస్స 2:9; II థెస్స 3:7-12). తన రెండవ సౌవార్తిక యాత్రలో ఎక్కువ కాలం ఆ పట్టణంలో ఉండలేక పోయాడు. యూదులు, పౌలు ఎవరి ఇంటిలో ఉన్నాడో ఆవ్యక్తిని అనగా యాసోనును పట్టుకోవడంతో మళ్ళీ సువార్తకు అభ్యంతరాలు ఏర్పడ్డాయి. ఆ రాత్రే పౌలు, తిమోతి, సీల బెరయకు వెళ్ళారు. (17:10-14).

బెరయలోని ప్రజలు, థెస్సలొనీకయుల కంటె ఘనులు. వారు ప్రతిరోజు లేఖనాలను పరిశోధించారు (17:11). అయితే అక్కడ కూడ పౌలును పట్టుకొనేందుకు ప్రయత్నించినందువలన తిమోతిని. సీలను అక్కడే వదలి పౌలు ఏథెన్సుకు వెళ్ళాడు (17:15-34).

ఏ థెన్సు పట్టణంలో పౌలు ప్రతి రోజు సమాజ మందిరంలోను సంత వీధుల్లోను ప్రకటించాడు. అతడు అరెయొపగు సభలో బోధించాడు.

పౌలు వారికి క్రీస్తును గూర్చి ప్రకటిస్తూ దేవుని గూర్చి నాలుగు గొప్ప సత్యాలను బోధించాడు. దేవుడు సృష్టికర్త (17:24,25) దాని పాలకుడు (17:26-29), ఆయనే రక్షకుడు (17:30), ఆయనే తీర్పరి (17:31). పౌలు తన ప్రసంగం మధ్యలో అరోటస్ అనే కవీశ్వరుని మాటల్ని వారికి జ్ఞాపకం చేసాడు (17:28). పౌలు సందేశానికి ప్రతిస్పందన పలు విధాలుగా ఉండినది. కొంత మంది అపహసించారు. మరికొంత మంది అతడు చెప్పేది తరువాత వింటామన్నారు (17:32). కొంత మంది విశ్వసించారు.

**తిమోతి మరియు సీల పరిచర్య :** పౌలు వీరిద్దరిని బెరయలో వదలి పెట్టి, వారు తనను ఏథెన్సులో కలిసికోవాలని చెప్పాడు (17:14-16) కాని అలా జరుగలేదు. ఫిలిప్పీలో ఉన్న లూకాకు సహాయం చేసేందుకు సీల బెరయ నుండి ఫిలిప్పీకి వెళ్ళాడు (18:5) తిమోతి, పౌలు కోరిక మేరకు థెస్సలొనీకయలోని విశ్వాసులను హెచ్చరించేందుకు తిరిగి ఆ పట్టణానికి వెళ్ళాడు (I థెస్స 3:1,2).

ఏథెన్సు నుండి పౌలు కొరింథుకు వెళ్ళాడు. అక్కడ క్రైస్తవునిగా మారిన అకుల, ప్రిస్కిల్ల అనే వారి ఇంట పౌలు 1 1/2 సంవత్సరాలు ఉన్నాడు. అతడు అక్కడి నుండే థెస్సలొనీకయులకు రెండు పత్రికలు వ్రాసాడు. మరోసారి యూదుల వల్ల ఆటంకాలు ఎదురయ్యాయి. అక్కడ సొస్తెనేసు, క్రిస్పు అనే సమామందిరపు అధికారి కుటుంబం రక్షించబడ్డారు. (I కొరి 1:1). అక్కడ పౌలు దర్శనంలో ప్రభువు మాటల్ని బట్టి బలపర్చబడ్డాడు (18:9,10) దేవుని పరిపూర్ణ చిత్తంలో ఉన్న ప్రతి సేవకుడు ఈ వాగ్దానాన్ని ధైర్యంగా స్వంతం చేసికోవచ్చును. ఇది జరిగాక పౌలు అకుల ప్రిస్కిల్లను వెంట బెట్టుకొని ఎఫెసుకు వెళ్ళాడు (18:18). అక్కడ కొంత కాలం ఉండి, అక్కడ నుండి అంతియొకయకు, యెరూషలేముకు వెళ్ళాడు (18:22).

**4. పౌలు మూడవ సౌవార్తిక యాత్ర (18:23-21:16) :** ఈ సౌవార్తక యాత్ర కూడ అంతియొకయ నుండే ప్రారంభమైంది. ఈ యాత్ర ముగించడానికి పౌలుకు దాదాపు 4 సంవత్సరాలు పట్టింది. అందులో దాదాపు 3 సంవత్సరాలు ఎఫెసులో గడిపాడు. ఈ కాలంలో గలతీయులకు, రోమీయులకు మరియు కొరింథీయులకు రెండు పత్రికలు వ్రాసాడు.



ఎఫెసులో పౌలుకు ఎదురైన మొదటి సమస్యను గూర్చి 19:1-7లో ఉంది. బాప్తిస్మమిచ్చు యోహాను, బాప్తిస్మం ఇచ్చే అధికారం ఎవరికీ ఇవ్వకపోయినా, అతని శిష్యులు కొంతమందికి బాప్తిస్మమిచ్చాడు. తన వెనుక వచ్చేవాడు పరిశుద్ధాత్మతోను, అగ్నితోను బాప్తిస్మమిస్తాడని యోహానే చెప్పాడు. ఈ విషయం వారికి తెలియకుండానే బాప్తిస్మం తీసికొన్నారు. కనుక పౌలు వారిని ఖండించి, బాప్తిస్మం విషయమైన చిక్కులను సరిచేసాడు (19:4,5).

తరువాత 3 నెలలు సమాజమందిరంలో పరిచర్య చేసాడు. అక్కడ ఆటంకాల వలన తురన్ను అనే వ్యక్తి పాఠశాలలో కూడుకోనారంభించారు. ఆ స్థలంలో పౌలును దేవుడు ఘనంగా వాడుకొన్నాడు. అనేక అద్భుతాలు జరిగాయి (19:12) మాంత్రికులు ప్రభువును విశ్వసించారు వారి పుస్తకాలను తగుల బెట్టారు. ఓవైపు దేవుని కార్యం బలంగా జరుగుతూ ఉంటే మరోవైపు సాతాను కార్యం కూడ జరుగుతూనే ఉంది. ఎఫెసులోని కంసాలివారంతా, దేమేత్రి అనేవాని నాయకత్వంతో పౌలుపైకి దొమ్మిగా వచ్చారు (19:23-41). ఇలా ఎఫెసులో ఎన్నో చిక్కులు వచ్చినా దేవుడు ప్రతి సమస్యను ఒక దీవెనగా మార్చి. పౌలుకు విజయాన్ని ఇచ్చాడు.

తరువాత పౌలు ఎఫెసునుండి మాసిదోనియాకు వెళ్ళి గ్రీసులో మూడు మాసాలు సువార్త పరిచర్య చేసి ఫిలిప్పీలో ఓడ ఎక్కి త్రోయ అనే స్థలానికి వచ్చాడు. త్రోయను విడిచి వెళ్ళడానికి ముందు రాత్రి పౌలు చాలసేపు మాట్లాడాడు. ఈ సందర్భంలో కిటికీలో కూర్చున్న ఐతుకు అనే యౌవనుడు క్రిందపడి మరణించడం, పౌలు అతన్ని లేపడం గమనార్హం. 20:18-38లో పౌలు మిలేతులో ఎఫెసు పెద్దలనుద్దేశించి చెప్పి మాటలు హృదయాన్ని కదిలిస్తాయి. అక్కడి వారికి అవే పౌలు చివరి వీడ్కోలు మాటలు.

కైసరయ అనే ప్రాంతానికి వచ్చినప్పుడు అగబు అనే ప్రవక్త పౌలు మరణాన్ని గూర్చి ప్రవచించాడు (21:10,11) యెరూషలేముకు వెళ్ళడం తన ప్రాణానికే ముప్పు అని తెలిసి కూడ ప్రభువు చిత్తానికి లోబడి, పౌలు తన మూడవ సౌవార్తిక యాత్రను ముగించి, యెరూషలేముకు ప్రయాణమయ్యాడు. అక్కడికి వెళ్ళవద్దని అందరు బ్రతిమిలాడినప్పుడు పౌలు చెప్పిన సమాధానం దృఢ నిశ్చయంతో కూడినది. (21:13)

**IV. పౌలు యెరూషలేము నుండి రోమా పట్టణానికి వెళ్ళుట. (21:17-28:31)**

యెరూషలేములో తనకు బంధకాలు, శ్రమలు కాచుకొని ఉన్నాయని తెలిసి కూడ పౌలు యెరూషలేముకు వచ్చాడు. (21:17-26). చాల కాలం తరువాత యెరూషలేము చేరుకున్న పౌలును చూసి అక్కడి విశ్వాసులు సంతోషించారు. కాని అక్కడికి చేరిన నాటి నుండే రకరకాల వత్తిళ్ళు, శ్రమలు ప్రారంభమయ్యాయి.

పౌలు యూదామతాచారాలను గౌరవిస్తున్నాడని నిరూపించేందుకు, యెరూషలేములోని పెద్దలు నాజీరు వ్రతం చేయమని పౌలుకు సలహా ఇచ్చారు. ఏ విధంగానైనా కొందరిని రక్షించాలని అందరికి అన్ని విధాలవానిగా ఉండాలన్నదే పౌలు ఉద్దేశం. ఎఫెసీయుడైన త్రోఫిము యూదుల దృష్టిలో అన్యుడు, పౌలు అతణ్ణి దేవాలయంలోనికి తీసికొని వెళ్ళాడని యూదులు పౌలుపై దాడి చేసి చంపాలని ప్రయత్నించారు (21:27-29) పౌలుకు యెరూషలేములో ఎదురైన సంఘటనలో దేవుని అదృశ్య హస్తం స్పష్టంగా కనిపిస్తుంది. యూదులు అతణ్ణి చంపాలని ప్రయత్నిస్తున్న

సమయంలో యెరూషలేములోని సైనికాధికారికి వర్తమానం అందటం, వెంటనే అతణ్ణి బంధించడం యాదృచ్ఛికంగా జరగలేదు. ఒకవేళ పౌలు యూదుల చేతుల్లో చిక్కుకొనివుంటే అతడు రోమా పట్టణానికి వెళ్ళే అవకాశమే ఉండేది కాదు.

మరోసారి ప్రజలందరితో మాట్లాడే అవకాశం పౌలుకు దొరికింది (22:1-22). పౌలు మాటలకు మత మౌఢ్యంతో మత్తులై ఉన్న ప్రజలు అతణ్ణి చంపమని కేకలు వేసారు. దాంతో సహస్రాధిపతి పౌలును కొట్టించి, విమర్శ కోసం అతణ్ణి కోటలో భద్రం చేసాడు. మరునాడు జరిగిన యూదుల మహాసభలో సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. పరిసయ్యులలో కొందరు పౌలు పక్షం వహించారు (23:7-9). ఆరాత్రి ప్రభువు పౌలును దర్శించి బలపర్చాడు. అతడు దేని నిమిత్తం ఏర్పరచుకోబడ్డాడో ఆ ఉద్దేశం నెరవేర్చబడబోతుంది. యూదుల కుట్ర నెరిగిన సైనికాధికారి రాత్రికి రాత్రే పౌలును కైసరయలోని ఫేలిక్సు దగ్గరకు పంపించాడు. 23:12,28,29).

అపొస్తలులకార్యములు 24, 25, 26 అధ్యాయాలలో కైసరయలో పౌలుకు జరిగిన మూడు విచారణలను గూర్చి వ్రాయబడింది.

1. మొదటి విచారణ – ఫేలిక్సు ముందు (24:1-27).
2. రెండవ విచారణ – ఫేస్తుముందు (25:1-2).
3. మూడవ విచారణ – అగ్రిప్పముందు (25:13-26:32)

పౌలుపై మూడు నేరాలు మోపబడ్డాయి. (24:5,6) అతడు భూలోకమందున్న సకలమైన యూదులను కలహానికి రేపేవాడని, నజరేయుల మత బేధమునకు కారకుడని, దేవాలయాన్ని అపవిత్రం చేసేందుకు ప్రయత్నించాడని నేరం మోపబడింది. అపో. 9:15 లోని మాటల నెరవేర్పు నిమిత్తం పౌలు ముగ్గురు అధికారుల యెదుట నిలబడాల్సి వచ్చింది.

ఫేలిక్సు భార్య ద్రుసిల్ల యూదురాలు. వారిద్దరు ఎన్నోసార్లు పౌలును పిలిపించుకొని సువార్త విన్నారు కాని అంగీకరించలేదు. మళ్ళీ సమయం ఉన్నప్పుడు వింటాను అని చెప్పిన ఫేలిక్సుకు ఆ సమయం మరలా ఎప్పుడూ రాలేదు. (24:25).

ఫేస్తు ముందు కూడ విచారణ జరిగింది. కాని యూదులు పౌలును దోషిగా నిరూపించలేపోయారు. పౌలు నిర్దోషి అని తెలిసి కూడ ఫేస్తు ప్రజల మెప్పుకోరి పౌలుకు న్యాయం జరిగించలేదు. తరువాత పౌలు అగ్రిప్ప రాజు ముందు నిలవాల్సి వచ్చింది. పౌలు అగ్రిప్పకే సూటియైన ప్రశ్నవేసాడు (26:8) తాను చేస్తున్న సువార్త ప్రకటన దేవుని ఆజ్ఞానుసారమైనదని వివరించాడు (26:19,20) అంతా విన్నాక అగ్రిప్ప పలికిన మాట చాల విచిత్రమైంది? "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే" అన్నాడు. పౌలు మాత్రం అతని మాటలు విన్నవారందరు బంధకాలు తప్ప, అతని వలెనే ఉండాలన్న ఆశ కలిగి ఉన్నాడు (26:29). చివరికి అతడు కైసరు ఎదుటనే తన వ్యాజ్యాన్ని చెప్పుకొంటాను అనటంతో పౌలును రోమాకు పంపించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

పౌలు, మరికొంత మంది ఇతర ఖైదీలు యూలి అనే శతాధిపతి ఆధీనంలో ఓడలో ప్రయాణం చేస్తున్న సమయంలో ఆ ఓడ గొప్ప తుఫానులో చిక్కుకొంది. ఆందోళన, భయంతో



నిండి ఉన్న ఖైదీలతో పౌలు చెప్పిన మాటలు ప్రశస్తమైనవి. (27:20-26). పౌలు ప్రయాణిస్తున్న ఓడ తుఫానులో చిక్కుకొన్నా, అతని జీవిత నావ శక్తిగలిగిన క్రీస్తు ఆధీనంలో క్షేమంగా ఉంది. ఆ భావనే పౌలుకు ధైర్యానిచ్చింది. (27:33-35).

కొన్నిసార్లు ప్రభువు మన జీవితాల్లో తుఫానులను అనుమతించినా, ఆ భయంకరమైన తుఫానులో సహితం మనల్ని శాంతి సమాధానాలతో నింపగలడు. పౌలు ధైర్యాన్ని బట్టి అందరూ ధైర్యపరచబడ్డారు. దేవుడు పౌలును బట్టి ఆ ఓడలో ఉన్న 276 మందిని తుఫాను బారి నుండి రక్షించాడు.

చివరికి వారు మెలితే అనే ద్వీపాన్ని చేరుకున్నారు. ఇది రోమాకు దాదాపు 350 మైళ్ళ దూరంలో మధ్యధరా సముద్రంలో ఉంది. శరీరరీత్య బంధీగా ఉన్నా పౌలు ఎంతో మందిని ఆధ్యాత్మికంగా బంధ విముక్తుల్ని చేసే పనిలో నిర్విరామంగా సాగిపోతున్నాడు. అక్కడి ప్రజలు అతణ్ణి ఒక దేవతగా భావించారు. (28:6). ఆ ద్వీపంలో మూడు నెలలున్న తరువాత సైనికులు పౌలును. ఇతర ఖైదీలను రోమాకు తీసికొని వెళ్ళారు.

పౌలు రోమా పట్టణానికి వచ్చేసరికే అక్కడ క్రైస్తవ్యం బాగా విస్తరించింది. కనుక అక్కడి విశ్వాసులు పౌలుకు స్వాగతం పలికేందుకు వెళ్ళారు. యెరూషలేము నుండి చెదరిపోయిన విశ్వాసులు రోములో సువార్త ప్రకటించారని, అక్కడ సంఘం స్థాపించబడిందని చరిత్ర చెప్తుంది.

అపొస్తలుల కార్యాల గ్రంథం చివరి రెండు వచనాలను బట్టి చూస్తే పౌలు రెండు సంవత్సరాలకు పైగా రోములో ఒక అద్దె ఇంట్లో ఉంటూ తన వద్దకు వచ్చిన వారందరికీ నిరాటంకంగా సువార్త ప్రకటించాడు (28:30,31). 28:24-28 లో యూదులతో చెప్పిన మాటలు మనందరికీ వర్తిస్తాయి.

తరువాత పౌలు విడుదల చేయబడి మరో సౌవార్తిక యాత్ర చేసినట్లు చరిత్రలో ఆధారాలున్నాయి. లూకా ఈ గ్రంథాన్ని హఠాత్తుగా ముగించినట్లనిపిస్తుంది. వాస్తవానికి ఈ గ్రంథం పూర్తిచేయబడలేదు. అది ఇంకా కొనసాగించబడుతూనే ఉంది. దేవుడు లూకా ద్వారా దాన్ని పూర్తి చేయించగలిగేవాడే. కాని నీవు, నేను పరిశుద్ధాత్మ ద్వారా జరిగించగల కార్యాలతో సంపూర్తిచేయబడాలని ఈ గ్రంథాన్ని అసంపూర్ణంగా వదిలేసాడు. మీరు దేవుని కార్యాలను కొనసాగించే కృప ప్రభువు దయచేయును గాక!

**TTB - Telugu - Study Outlines - Books of Acts**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.
**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**